పరమపద సోపానం

ఆంగడికి వెళ్ళిన పక్కింటి అబ్బాయి ఇంకా తిరిగి రాలేదు.

శ్రీమతికి కంగారుగా వుంది.

అరగంట క్రితమనగా నల్లులమందు తీసుక రావడం కోసం అతడిని పంపింది ఆమె.

ఎవ్వరికీ తెలియకుండా రహస్యంగా తీసుక రమ్మని రెండు మూడుసార్లు హెచ్చరించింది. అలాచేస్తే పావలా యిస్తానని ఆశచూపెట్టింది. దాంతో గాలిపటమూ, దారమూ కొనుక్కోవచ్చునని వూరించింది.

తాను నల్లుల మందుకోసం ఆ అబ్బాయిని పంపినట్టు ఎవరయినా తెలుసుకున్నారేమోనని భయపడుతోంది.

పైకిలేచి వీధి గుమ్మంకేసి నడచింది.

వీధిలో గ్రీష్మకాలపు సూర్యుడు తన ప్రతాపం చూపెట్టుతున్నాడు. అందువల్ల వీధి నిర్మానుష్యంగా వుంది. ఆ అబ్బాయి వచ్చే జాడ కనిపించకపోవడంతో శ్రీమతి వెనుదిరిగింది.

ఇంతలో తనను పలకరిస్తున్నట్టుగా ఈల వినిపించింది. ఉలిక్కిపడి వెనుదిరిగింది. బుద్ధిమంతుడిలా పేపరులో తల దాచుకున్నాడు నరహరి. అటువైపుకోసారి వురిమి చూసి శ్రీమతి యింటిలోకి వచ్చేసింది.

రాజమ్మ యింకా షాక్‌నుంచి కోలుకోలేదు. శ్రీమతికి తన తల్లి బాధలనే పదార్థంతోనే పోతపోసిన విగ్రహంలా కనిపించింది.

మానవజీవితం సమస్యల పుట్టలాంటిది. ఒక సమస్య తొలగిపోతే మరో సమస్య పుట్టుకొస్తుంది. రాజమ్మ జీవితం సమస్యల నెదుర్కోవడంలోనే జరిగిపోతోంది. జీవితాంతం అండగా నిలవాల్సిన భర్త పదిహేనేళ్ళ క్రితమే చనిపోయాడు. సంసారాన్ని ఆవిడే పోషించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయినా ఆవిడప్పుడు యింతగా క్రుంగిపోలేదు. నాలుగైదు యిళ్ళలో పాచిపని చేసింది. రోజూ కూలికి వెళ్ళేది. పెద్దవాడు ప్రకాశాన్ని యింటర్మీడియట్‌వరకూ చదివించుకొంది. ఆ తరువాత ప్రకాశం తాను చదవనుగాక చదవనని భీష్మించుక కూర్చున్నాడు. తన స్నేహితుడి సహాయంతో ఫ్రూట్‌జ్యూస్ తయారుచేసే ఫ్యాక్టరీలో ఓ చిన్న వుద్యోగం సంపాదించుకున్నాడు. నెలకు మూడువందల జీతం.

"ఎదిగి వచ్చిన కొడుకు బాధ్యతలనుంచీ విముక్తురాల్ని గావించినా ఆమెను బాధలింకా వదిలిపెట్టలేదు. అందుకు తానేగా కారణం!" అనుకొంది శ్రీమతి.

'వీల్లేదు. తాను మరొకరికి బరువుగా వుండగూడదు. తనవల్ల మరొకరు బాధ పడకూడదు. ఇందుకు పరిష్కారం తానే ఆలోచించాలి' అనుకొని పైకి లేచి వీధిలోకి నడచింది.

వీధిలో పక్కింటి అబ్బాయి కనిపించాడు.

దగ్గరికి వచ్చిన తరువాత జేబులో నుంచీ డబ్బులు పైకి తీశాడు.

మధురాంతకం నరేంద్ర

డబ్బులు ఆమె చేతిలో పెడుతూ "మందు లేదన్నారు. స్టాకు అయిపోయిందట. వారం వరకూ రాదన్నారు" అన్నాడు.

ఆమె నిరుత్సాహపడిపోయి "పోనీలే" అంటూ వెనుదిరిగింది.

"మరి పావలా " గొణిగాడు పక్కింటబ్బాయి.

వాడి చేతిలో పావలాబిళ్ళ పెడుతూ "ఈ విషయం ఎవరికీ చెప్పగూడదు " అంది శ్రీమతి.

సరేనంటూ తుర్రుమన్నాడు ఆ అబ్బాయి.

శ్రీమతి లోపలకొచ్చి మూలగా చుట్టిపెట్టి వున్న పడకలపైన వాలిపోయింది. ఎదురుగా అలమారాలో అందంగా సర్దిపెట్టివున్న పుస్తకాలు ఆమెను వెక్కిరిస్తున్నట్టుగా కనిపించాయి ఆమెకు వాటి అవసరం చాలా రోజుల క్రితమే తీరిపోయింది. శ్రీమతి కాలేజీకి వెళ్ళడం మానేసి సంవత్సరం రోజులకుపైగా అవుతోంది.

* * *

పద్దెనిమిదేళ్లు ముగిసీ ముగియక మునుపటి నుంచీ శ్రీమతికి పెళ్లి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎందరో వచ్చి చూశారు. తమకు తగినంత అందం లేదన్నారు కొందరు. కట్నం చాల్లేదన్నారు యింకొందరు. జాతకాలు కుదరలేదనేశారు మరికొందరు. చివరికో సంబంధం కుదిరింది. పెళ్లిపత్రికలు ప్రింటయ్యాయి. ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. అటువంటి సందర్భంలో మరికొంత డబ్బు ఎక్కువగా లభించే యింకో సంబంధం చూసుకున్నారు అవతలి వాళ్లు. పెళ్లి ఆగిపోయింది. శ్రీమతి అన్నయ్య ప్రకాశానికి తల కొట్టేసినంత పనయ్యింది. రాజమ్మ నెత్తీ నోరూ మొత్తుకుంది. తనకేసి అందరూ అదోలా చూస్తున్నారంటూ అప్పుడే శ్రీమతి కాలేజీకి వెళ్ళడం మానేసింది.

వంటింట్లో పాత్రలు దొర్లుతున్న శబ్దం వినగానే పైకి లేచింది శ్రీమతి. అన్నం పాత్రను పడదోసి నేలపైకి పడిన అన్నాన్నంతా తినేస్తోంది ఓ కుక్కపిల్ల. మధ్యాహ్నం తల్లీ కూతుళ్లిద్దరూ భోంచేయలేదు. అందుకే అన్నం అలా పాత్ర నిండుకూ వుండిపోయింది. అడుగుల చప్పుడు వినగానే తల పైకెత్తి చూసి, ఆమె అట్లకాడ చేతికందుకోగానే కుక్కపిల్ల బయటకి దౌడు తీసింది.

శ్రీమతి బయటకు వచ్చి మళ్ళీ పడకల పైకి వాలిపోయింది.

భయంకరమైన నిశ్శబ్దం మళ్ళీ ఆవరించుకొంది.

ప్రొద్దున పదిగంటల ప్రాంతంలో శ్రీపతి తండ్రి రాసిన వుత్తరం అందుకొన్నప్పటి నుంచీ ఆ యింటిని అలాంటి నిశ్శబ్దమే రాజ్యమేలుతోంది.

'శ్రీపతి-శ్రీమతి' పేర్లెంత బాగా కుదిరాయి అని వందసార్లయినా అనుకొని వుంటుంది శ్రీమతి.

రోజంతా విపరీతంగా ఎండకాసిన తరువాత సాయంకాలం అనుకోకుండా భోరున కురిసే వర్షంలా వాళ్లింటికి వచ్చాడు శ్రీపతి. అతగాడు ప్రకాశానికి బాల్యస్నేహితుడు. బీకామ్ వరకూ చదువుకొని కర్నూల్లో బ్యాంకు వుద్యోగం చేసుకుంటున్నాడు. సమయం చూసి తన మనసులోని మాట బయటపెట్టాడు ప్రకాశం. మా యింట్లోగూడా ఈమధ్య పెళ్లి పెళ్ళంటూ తొందరపెడుతున్నారు. 'మీ అమ్మానాన్నా ఒప్పుకుంటే మీ చెల్లెల్ని పెళ్లిచేసుకోవడానికి నాకేమీ అభ్యంతరంలేదు' అనేశాడు శ్రీపతి. అతడి అమ్మానాన్నా వచ్చి చూశారు. అమ్మాయి వాళ్ళకు నచ్చింది. పెళ్లి నిశ్చయమైపోయింది. పెళ్లిపనులు చకచక జరిగిపోతున్నాయి. ఫ్యాక్టరీవాళ్ళ పనులు చెయ్యడంకోసం ప్రకాశం తిరుపతికి వెళ్లిన రోజునే ఆ వుత్తరం వచ్చింది. శ్రీపతికి తనకిప్పుడిప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదని వాళ్ళనాన్నగారికి వుత్తరం రాశాడట! ఆ విషయమే ప్రకాశానికి తెలియజేశాడు ఆయన.

"మొదటిసారీ యిలాగే పెండ్లి నిశ్చయమైపోయిన తరువాత మనపనులు మనం చేసుక

పోతూవుంటే ఆగిపోయింది. ఇప్పుడూ ఇలాగే జరుగుతోంది. నిశ్చయమైపోయిన ఈ పెండ్లి యిలా ఆగిపోతూవుంటే ఎలాగే శ్రీమతీ! నేనేం చెయ్యనే. అయ్యో నా రాతా!" అంటూ వాపోసాగింది రాజమ్మ.

"అప్పుడే మొదలుపెట్టావా ఏడుపు! అయినా ప్రపంచానికి యిప్పుడేం ప్రళయమొచ్చింది చెప్పు?....నేనసలు పెళ్ళే చేసుకోను. నువ్వలా ఏడిస్తే నేనూరుకోను" అంటూ జీరబోయిన గొంతుతో వారించింది శ్రీమతి.

కూతురికి భయపడి నోరు తెరిచి మాట్లాడక పోయినా అప్పటినుంచీ రాజమ్మ మనసులోనే క్రుంగిపోతోంది. తల్లి అలా బాధపడుతూ వుండడాన్ని గమనించిన శ్రీమతి భరించలేక పోయింది.

ప్రతివిషయానికీ దండిస్తూవుంటే పిల్లలు మొండివాళ్ళుగా తయారౌతారు. సమస్యలు విశ్వరూపాన్ని ధరించినప్పుడు పెద్దలు గూడా అలాగే మొండివాళ్లుగా తయారవుతారనిపిస్తుంది.

శ్రీమతిని అలాంటి మొండితనమే ఆవహించింది.

తనవల్ల ఏర్పడిన సమస్యకు తానే సరయిన పరిష్కారం చూసుకోవాలని అనుకొంది. ఆలోచించి, ఆలోచించి చివరకు పక్కింటి అబ్బాయిని నల్లులమందు తెచ్చిపెట్టమని అడిగింది. రాజమ్మ బలహీనంగా మూలుగుతూ వుండడం వినిపించగానే శ్రీమతి వులిక్కిపడింది. ఆమె దగ్గరికి నడిచి "ఏమిటే అమ్మా' మూలుగుతున్నావు?" అంటూ కంగారుగా ప్రశ్నించింది.

నాలుగయిదుసార్లు కుదిపికుదిపి అడిగిన తరువాత మెల్లగా కళ్లు తెరిచింది రాజమ్మ. "గుండె నొప్తోంది" అంది.

"చాలా సేపటి నుంచీ నొప్తోందా?"

"ఇప్పుడే కొద్దిగా ఎక్కువయ్యింది."

శ్రీమతి డాక్టరు దగ్గరికి పరిగెత్తింది.

ఆ వీధిలోనే కొంచెం దూరంలో ఓ డాక్టరు కొత్తగా ప్రాక్టీసుపెట్టాడు. అతడిని తీసుకొచ్చింది.

పేషెంటును పరీక్షించిన తరువాత కొన్ని టేబ్లెట్లు తెప్పించమని ప్రిస్క్రిప్షన్ వ్రాసిచ్చాడు డాక్టరు. ఇంజెక్షను చేసిన తరువాత ఫీజు తీసుకొని వెళ్లిపోతూ "అనవసరంగా ఆలోచించడమూ, ఆవేశపడడమూ మంచిదిగాదు. నేను వ్రాసిచ్చిన మందులు చెప్పిన ప్రకారం వాడండి. ఆ మాత్రలు వేసు

కుంటే బాగా నిద్ర పడుతుంది. ఒక మాట-మీరు రాత్రికంతా పేషెంటుపైన ఒక కన్ను వేసివుండాలి. మరేమీ కంగారు పడవలసిన అవసరం లేదు" అన్నాడు.

శ్రీమతి బజారుకు వెళ్ళి మాత్రలు తీసుకొచ్చింది.

ఆమె రాత్రంతా నిద్రపోనట్టే లెక్క.

ఆత్మహత్య మహాపాపమన్నారు పెద్దలు. ఒడుదుడుకులకు తట్టుకొని సూటిగా గమ్యం కేసి నడుస్తూ కర్తవ్యపాలన చేయమంటుంది గీత. రాత్రంతా ఆలోచిస్తూ వుండిన శ్రీమతి తెల్లవారేసరికి చచ్చిసాధించేదేమీ వుండదన్న నిర్ణయాని కొచ్చేసింది. ఆమె మనసులో మరో వూహ స్ఫురించింది. తనవాళ్ళకూ, తనవూరికీ దూరంగా ఎక్కడికో మారుమూల ప్రాంతానికో, సుదూర తీరానికో పారిపోవాలనిపించింది. కానీ ఒంటరిగా తానెలా అంతదూరం వెళ్ళగలదు? తనకో తోడు కావాలి. తనకు తోడెవరు వస్తారు?

శ్రీమతి కప్పుడు నరహరి గుర్తొకొచ్చాడు.

కొందరు నిర్దుష్టమయిన జీవితాన్ని గడపలేరు. సమయానికింత తినడం కోసం మిగిలిన అవసరాలు తీర్చుకోవడం కోసం ఎక్కడో ఒక చోట, ఎదో ఒక పని చేస్తారు. వాళ్ళకు నా అనేవాళ్ళుండరు. ఒకవూళ్ళో వాళ్ళుండలేరు. ఒకచోట పని చేయలేరు. ఎక్కడ పడితే అక్కడ తిరగడం, తోచినట్టల్లా ప్రవర్తించడం వాళ్ళకలవాటు. వాళ్ళు దారం తెగిన గాలిపటాలు; తాడులేని బొంగరాలు.

నరహరి అలాంటివాడే!

అతడిది ఆ వూరు కాదు. రెండు మూడు నెలల క్రితం ఆ వూరు వచ్చాడు. శ్రీమతి యింటి కెదురుగా సోడాలు తయారుచేసే అంగడొకటుంది. అందులో అతను పనిచేస్తూ వుంటాడు. సమయం దొరికినప్పుడల్లా మాంసం ముక్కకోసం చూసే కుక్కలా ఎదురింటి వైపు చూపులు సారిస్తూ వుంటాడు.

అంగడిలో అతడున్నాడో లేడో చూడ్డం కోసం వీధి వాకిలి దగ్గరికి వచ్చింది శ్రీమతి.

నరహరి అంగడిలో కనిపించాడు.

కానీ అప్పుడే తిరుపతి నుంచి తిరిగొచ్చిన ఆమె అన్న ప్రకాశం "నా కోసమేనా ఎదురు చూస్తున్నావు?" అంటూ లోపలి కొచ్చాడు.

శ్రీమతి అతడి వెనకాలే నడచింది.

మంచంపైన పడుకొని వున్న తల్లిని చూడగానే "ఈవేళప్పుడు అమ్మ ఎందుకలా పడుకొందే శ్రీమతీ?" అని అడిగాడు.

"నిన్న గుండె నొప్పొచ్చింది. డాక్టరొచ్చి మందిచ్చి వెళ్ళాడు. ఇంకా నీరసంగా వుంటే"

"ఎందుకొచ్చింది?" అంటూ తల్లి వైపు నడచాడు.

రాజమ్మ కళ్ళు తెరిచింది.

"ఎలా వుందమ్మా?" కంగారుగా ప్రశ్నించాడు ప్రకాశం.

అన్ని ప్రశ్నలకూ సమాధానంలా శ్రీమతి వుత్తరం తీసుకొచ్చి యిచ్చింది.

వుత్తరం చదవగానే కాస్సేపు నిశ్చేష్టుడై వుండిపోయాడు ప్రకాశం. తరువాత కాలు గాలిన పిల్లిలా మండిపడసాగాడు.

"చూస్తాను. వాడి కిధేమిటో తేలుస్తాను. చేసుకుంటాననటం, తరువాత కాదుపొమ్మనటం అంతా వాడిష్టమే నేమిటి? ఇప్పుడు చేసుకోనంటే ఎలా కుదురుతుందో కనుక్కుంటాను" అంటూ పైకిలేచి "వెళ్ళొస్తాను" అన్నాడు.

"ఎక్కడికి?" అంటూ ప్రశ్నించింది రాజమ్మ.

"కర్నూలుకు."

"అప్పుడేనా? అంత తొందరెందుకు?" అంది శ్రీమతి.

"ఇప్పుడుగాక మరెప్పుడు తొందరపడాలి? నువ్వేం భయపడకమ్మా! అసలు సంగతేమిటో తెలుసుకొని వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు ప్రకాశం.

రాజమ్మ బాధగా కళ్ళు మూసుకొంది.

ఆడపిల్లను గుండెల మీద కుంపటితో పోల్చాడో మహానుభావుడు. ఇంకా నయం గుండెల్లోని కుంపటనలేదు. నిజానికి ఆడపిల్ల

అందరికీ బరువే! ఆ బరువు దించుకోవడం కోసం పడరానిపాట్లు పడతారు. దించుకోలేక పోతే క్రుంగిపోతారు. తనకోసం తనవాళ్ళలా బాధపడుతూ వుంటే చూస్తూ భరించడానికి ఆ అమ్మాయి యంత్రం గాదు. 'ఊరినుంచీ నిరాశతో తిరిగొచ్చే అన్నయ్య ముఖం తానెలా చూడగలదు? ఒద్దు తండ్రీ ఒద్దు! అంత సాహసం తనకు లేదు. ఈ సమస్యకు పరిష్కారం తానే చూడాలి' దృఢ నిశ్చయంతో పైకిలేచి వీధివైపు నడచింది శ్రీమతి.

ఎదురుగా కొట్లో కనిపించాడు నరహరి.

రమ్మంటూ సైగ చేసింది.

అతడు దగ్గరికొచ్చి ఏమిటన్నట్టుగా చూశాడు.

శ్రీమతి నవ్వడానికి ప్రయత్నించింది. "ఈ పూళ్ళో నాకేమీ తోచడం లేదు" అంది.

నరహరికేమీ అర్థం గాలేదు. అయోమయంగా చూశాడు.

"ఎక్కడి కయినా వెళ్ళాలని వుంది. మదరాసు వెడదాం వస్తావా?"

నరహరి ఆనందంగా తల వూపాడు.

"రాత్రి పదకొండు గంటలకు రెడీగా వుంటావుగదూ?"

అతను సరేనన్నాడు.

సాయంకాలం ఏడుగంటలకంతా శ్రీమతి వంటపని పూర్తి చేసింది. ఎనిమిది గంటల ప్రాంతంలో బలవంతంగా కూర్చోబెట్టి తల్లిచేత చారన్నం తినిపించింది. మానసికంగా అలసిపోయిన రాజమ్మను పదిగంటలకు నిద్ర కరుణించింది!

ఊరు మాటు మణిగిపోయినప్పటినుంచీ వీధి గడపలో కూర్చుని ఎదురుచూడసాగింది శ్రీమతి.

ఇంట్లో చీకటిగా వుంది.

అయినా వీధి దీపం వెలుతురు మసక మసకగా పడుతోంది.

పక్కింటి గడియారం పదకొండు గంటలు కొట్టింది. ఉలిక్కిపడి తాను సర్దుకున్న



"ఎందుకురా అన్ని పేపర్‌యారోస్?"

"ఈ రోజు మా క్లాసుకు ఓ కొత్త మాష్టారు వస్తున్నారమ్మా!!"

సామాన్లు తనికీ చేసుకొంది శ్రీమతి.

కాలం బరువుగా గడచిపోతోంది.

శ్రీమతి ఎదురు చూస్తూనే వుంది.

పక్కింటి గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

ఒంటి గంటయ్యింది.

నిశ్శబ్దంగా వున్న కాలసముద్రంలో పడి గంటలనే గులకరాళ్ళు బుడుంగున మునిగిపోతున్నాయి!

నరహరి జాడ కనిపించలేదు.

తెల్లవారుజామున శ్రీమతి తనకు తెలియకుండానే అక్కడే వీధి గడపను తలగడగా చేసుకొని నిద్రలోకి జారిపోయింది.

ఉదయం వీధిలో కొళాయి దగ్గర బిందెల చప్పుళ్ళు, సూటిగా ముఖంపైకి వచ్చి పడుతున్న సూర్యకిరణాలు శ్రీమతిని నిద్రలేపాయి.

నిద్ర లేచిన రెండు మూడు నిముషాల తరువాత శ్రీమతికి జరిగినదంతా అర్థమైంది.

"కొళాయి దగ్గర అప్పుడే జనం పెరిగిపోతున్నారే తల్లీ! వెళ్ళి నీళ్ళపని చూడు. అయినా అదేం పొయ్యేకాలమే! గడప దగ్గర పడకయినా లేకుండా పడుకొన్నావు? తల పట్టుకోదూ?" అంటూ కర్తవ్యాన్ని బోధించింది రాజమ్మ.

కంగారును కప్పిపుచ్చుకోవడం కోసం ప్రయత్నం చేస్తూ బిందెను అందుకొని వీధి

లోకి నడచింది శ్రీమతి.

'ప్రతి విషయంలోనూ తాను అనుకొన్న దానికీ జరిగేదానికి పొంతన కుదరడమే లేదు. లేకపోతే ఆ నరహరి వస్తానని మాటిచ్చి తీరా రాకనే పోవాలా? ఈ రాత్రి ఆయనగారికంత తొందర పనేమొచ్చిందో. .' మనసులో విసుక్కొంటూ బిందెను కొళాయి దగ్గర పెట్టింది ఆమె.

"విన్నావుటే శ్రీమతీ! " అంటూ వుదయం వార్తలను తెలియజేయడం కోసం పలకరించింది పక్కింటావిడ.

ఏమిటన్నట్టుగా చూసింది శ్రీమతి.

"సోడాకొట్లో వుండేవాడే నరహరి "

శ్రీమతి వులిక్కిపడి ఆమెకేసి చూసింది. ఆవిడ చెప్పుకుపోసాగింది—"నువ్వూ చూసే వుంటావులే నాకు వాడ్ని చూసినప్పుడే అనుమానం వచ్చింది. వాడికి లేని వ్యసనం లేదు. అన్నీ చెడుసావాసాలే! వాడనుకొన్నంతపని చేయనే చేశాడు "

"ఇంతకూ ఏం చేశాడో చెప్పు .. " విసుక్కొంది శ్రీమతి.

"ఎక్కడో దొంగతనం చేశాడట. అసలు వాడు పాత కేడీనేనని చెప్పారు మావారు. ఎక్కడో ఏదో దొంగపని చేసి తప్పించుకొని యిక్కడికి వచ్చాడట! నిన్నరాత్రి పోలీసులు పట్టుకెళ్ళి కమ్ముల్లో పెట్టారుట."

'ఇటువంటివాడితోనా తాను వెళ్ళాలనుకొంది' శ్రీమతి భయంతో వులిక్కిపడింది. అలా జరగనందుకు సంతోషించింది.

ఇంట్లో యాంత్రికంగా పనులు చేసుక పోతూనే వున్నా ఆమె మనసు ఆలోచిస్తూనే వుంది. 'కుక్కతోక పట్టుకొని తాను గోదావరీదాలనుకొంది. మట్టి గుర్రాన్ని నమ్మాలనుకొంది. ఎంతలో ఎంత గండం గడిచిపోయింది? ఈ ప్రపంచంలో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మగూడదో అర్థం గావడం లేదు. ఇక ఇలా గాదు. ఈ ప్రపంచంలో తా నొంటరిగా పోరాడాల్సిందే!' అని నిశ్చయించుకుంది.

ఇల్లంతా వెదికి డబ్బులు ప్రోగుచేసుకుంది. రాత్రికి ఒంటరిగానే యిల్లు వదలిపెట్టి వెళ్ళిపోవాలన్న నిర్ణయాని కొచ్చింది.

మునుపటి రోజులాగాక రాజమ్మ పైకిలేచి యింటి పనులలో కూతురికిసహాయపడసాగింది.

మధ్యాహ్నం తల్లికి అన్నంపెట్టి తానూ భోంచేసింది శ్రీమతి.

పడకపైన వాలిపోవడ మొక్కటే ఆమెకు తెలుసు. రాత్రి చాలాసేపటివరకూ నిద్రపోకుండా మేలుకునే వుండడంవల్ల నిద్రలోకి జారిపోయింది.

సాయంకాలం నాలుగు గంటలయ్యింది.

అనుకున్నదానికంటే ముందుగా వచ్చేసి నట్టున్నాడు ప్రకాశం. మగత నిద్రలోవున్న శ్రీమతి అతడి మాటలు విని వులిక్కిపడి పైకి లేచింది.

"శ్రీపతి బలేవాడు లేమ్మా! వారం రోజులుగా దగ్గుతూ వుండడంతో అనుమానమొచ్చిందట! అతగాడు సిగరెట్లు కాలుస్తాడులే! తనకేదో రోగమొచ్చిందని అనుకున్నాడు. డాక్టరెవడో అతడికి తగినవాడే దొరికాడు. వీలయినంత ఎక్కువగా డబ్బు గుంజడం కోసం ఎక్స్‌రేలూ, బ్లడ్‌టెస్టూ అంటూ కంగారు పెట్టేశాడట! శ్రీపతి తనకేదో పెద్ద జబ్బొచ్చేసిందని నిర్ణయించుకొని తనవల్ల మరో అమ్మాయి జీవితం పాడైపోతుందని భావించుకొని, యింటికలా వుత్తరం రాసాడట! తీరా నేను వెళ్ళి కోపంతో కేకలేసేసరికి జరిగినదంతా చెప్పాడు. డాక్టరు చివరకు ఆ లక్షణాలేమీ లేవని తేల్చి చెప్పేశాడట. ప్రస్తుతం ఆరోగ్యంగా గుండులా వున్నానని నమ్మకం కలిగింది ఆయనగారికి. అందువల్ల పెళ్ళి ఆగడమన్న ప్రసక్తే లేదు. అన్నట్టు చెప్పడం మరిచాను-ముహూర్తం చీర ఏ రంగులో కొనాలో చెల్లెల్నడిగి రాయమన్నారట శ్రీపతి తండ్రిగారు "

ఊహించని విషయాన్ని విన్నందువల్ల శ్రీమతి కాస్సేపు స్థాణువులా వుండిపోయింది.

క్రమక్రమంగా ఆమె ముఖంలో వెలుగు చోటు చేసుకొంది. □